క్లుప్తంగా

ఎమ్మార్పీఎస్ మండల శాఖ అధ్యక్షుడిగా మహేష్



దాచేపల్లి : ఎమ్మార్పీఎస్ మండల శాఖ అధ్యక్షుడిగా నడికుడికి చెందిన వేల్పుల మహేష్ మాదిగ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు అద్దంకి బాబు మాదిగ విడుదల చేసిన నియామకపు ఉత్తర్వులను బుధవారం మహేష్ మాదిగ మీడియాకి విడుదల చేశారు. ఎమ్మార్పీఎస్‌ని గ్రామస్థాయి నుంచి మరింతగా బలోపేతం చేసేందుకు తనవంతు కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు మహేష్ మాదిగ చెప్పారు. జిల్లా ఉపాధ్యక్షుడు మాతంగి సత్యానందం మాదిగ, మీసాల బాబు, వర్లా ఆగస్టీన్ మాదిగ తదితరులు ఆయన్ను అభినందించారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేస్తా !

గురజాల : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని పార్టీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కలకండ ఆంద్రెయ్య అన్నారు. తన కార్యాలయంలో బుధవారం మాట్లాడుతూ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో విజయం సాధించే విధంగా పార్టీకి ముందుకు తీసుకువెళ్తానని చెప్పారు. అందరిని కలుపుకుని ముందుకు సాగుతానని పేర్కొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

పిడుగురాళ్ల: పట్టణంలోని సాయి వృద్ధాశ్రమంలో దూళ్లిపాళ్ల ఎల్‌వీ ప్రసాద్ హాస్పిటల్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. శుక్లాలు, పొరలు, నీటి కాసులు తదితర వ్యాధులను అనుభవజ్ఞులైన వైద్య బృందం పరీక్షిస్తుందని నిర్వాహకులు తెలిపారు. శిబిరం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. హాజరయ్యే వారు వెంట ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ తెచ్చుకోవాలని సూచించారు.

స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్ ఇవ్వాలి



మాచర్ల: ఉమ్మడి గుంటూరు జిల్లాలో స్పెషల్ తెలుగు పూర్తి చేసిన ఉపాధ్యాయులను స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్ ఇచ్చి సీనియార్టీ జాబితాలో చేర్చాలని కోరుతూ డీఈఓ రేణుకకు బుధవారం ఏపీటీఫ్ జిల్లా అధ్యక్షులు బసవ లింగరాజు ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా కౌన్సిలర్ ఎం. వెంకటేశ్వర్లు, పలువురు స్పెషల్ తెలుగు ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కాలేజీలో క్లాసులు ప్రారంభం

పిడుగురాళ్ల: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్‌మీడియెట్ క్లాసులు ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ ఆర్‌కే ఈశ్వర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 1న ద్వితీయ సంవత్సరం, ఏప్రిల్ 7న మొదటి సంవత్సరం క్లాసులు ప్రారంభించినట్లు ఆయన పేర్కొన్నారు. కొత్తగా ఎంబైపీసీ ప్రారంభించినట్లు వెల్లడించారు. ఇందులో ఎంపీసీ వారు అదనంగా ఒక బైపీసీ సబ్జెక్టు, బైపీసీ వారు అదనంగా ఎంపీసీలో ఒక సబ్జెక్టును ఎంచుకొని చదువుకునే అవకాశం ఉందని ఆయన వివరించారు.

రేపు శాంతియుత ర్యాలీ జయప్రదం చేయండి

నరసరావుపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ వచ్చే శుక్రవారం 11వ తేదీన ముస్లిం, కుల, ప్రజా సంఘాలతో కలిసి శాంతియుతంగా నిర్వహించే ర్యాలీని జయప్రదం చేయాలని ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు షేక్ మౌలాలి, మత పెద్ద హాఫీస్ బాజిత్, మస్తాన్‌వలి, కరీముల్లా బుధవారం ఒక ప్రకటనలో కోరారు.

స్వచ్ఛతే లక్ష్యంగా పనిచేయాలి

నాదెండ్ల: గ్రామాల్లో స్వచ్ఛతే లక్ష్యంగా పంచాయతీ సిబ్బంది పనిచేయాలని నరసరావుపేట డీఎల్‌పీవో లక్ష్మణరావు చెప్పారు. నాదెండ్ల ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రంలో బుధవారం యడ్లపాడు మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం టీఏలు, క్లాప్‌మిత్రలు, గ్రీన్‌గార్డులకు శిక్షణ నిచ్చారు. మార్చి నెలాఖరులో జరగాల్సిన శిక్షణ ఉప ఎన్నిక కారణంగా వాయిదా పడింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో పూర్తిగా చెత్త సేకరణ లక్ష్యంగా పని చేసి తద్వారా పంచాయతీకి అదనపు ఆదాయం సమకూర్చుకోవాలన్నారు. అనంతరం ఘనవ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని సందర్శించి సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో నాదెండ్ల సర్పంచ్ మొగిలి నాగలక్ష్మి, నాదెండ్ల ఎంపీడీవో స్వరూపరాణి, యడ్లపాడు, నాదెండ్ల ఈవోపీఆర్డీలు షేక్ జాకీర్ హుస్సేన్, నిర్మలాలక్ష్మీకుమారి కార్యదర్శులు మక్కెన సుబ్బారావు, మారుతి బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమంపై చర్చకు సిద్ధం

- స్వార్థం కోసమే ఫ్యాక్టరీలను మూయించిన టీడీపీ నేతలు
- మాజీ ఎమ్మెల్యే కాసుని విమర్శించే స్థాయి వారికి లేదు
- సమావేశంలో వైఎస్సార్‌సీపీ నేతలు ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేతలు

దాచేపల్లి : నియోజక అభివృద్ధి, ప్రజల సంక్షేమంలో మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి కృషి ఎంతో ఉందని వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ షేక్ సుభాని అన్నారు. నారాయణపురంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం పార్టీ నేతలతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే కాసుపై టీడీపీ నాయకులు చేసిన వ్యాఖ్యలను నేతలు తీవ్రంగా ఖండించారు. దాచేపల్లి మండలంలో పాఠశాలలు, దేవాలయాలు, చర్చిలు మసీద్‌లు అనే తేడా లేకుండా బెల్ట్‌షాపులు పెట్టి అక్రమంగా సంపాదించుకుంటున్న ఘనత టీడీపీ నాయకులదని సుభాని ధ్వజమెత్తారు. 2014–19, 2019–24 మధ్య జరిగిన అభివృద్ధిపై తాము చర్చకు సిద్ధంగా ఉన్నామని ఆయన చెప్పారు. అభివృద్ధిని టీడీపీ నాయకులు మరచి వ్యక్తిగత విమర్శలు చేయడం తగదని హితవు పలికారు. మాజీ ఎమ్మెల్యే కాసుపై హత్య కేసు గానీ, జైలుకి వెళ్లిన చరిత్ర లేదని, టీడీపీ నాయకుడిపై హత్య, సీబీఐ కేసులు, జైలుకి వెళ్లిన చరిత్ర ఉందని మాజీ పట్టణ కన్వీనర్ మునగా పున్నారావు తెలిపారు. అవినీతి, మైనింగ్ డాన్ అని యరపతినేనికి తాము పేరు పెట్టలేదని, ఆయన చేసిన అక్రమాలు, అవినీతి ఆయనకు ఆ పేరు తెచ్చి పెట్టాయని పున్నారావు గుర్తుచేశారు. స్థానిక ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు డబ్బుల కోసమే చెట్టినాడ్ సిమెంట్, భవ్య సిమెంట్ ఫ్యాక్టరీలను ఆపివేయించారని, దీనివల్ల వేల కుటుంబాలు రోడ్డున పడ్డాయని పార్టీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు మందపాటి రమేష్‌రెడ్డి ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే కాసు మాట్లాడిన తరువాతనే ప్రభుత్వంలో చలనం వచ్చి మూతపడిన చెట్టినాడ్ సిమెంట్, భవ్య సిమెంట్ ఫ్యాక్టరీలను తెరిపించారని, సాక్షి దినపత్రికలో వచ్చిన వరుస కథనాలు ప్రభుత్వ యంత్రాంగాన్ని, ప్రభుత్వాన్ని కదిలించాయని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాకీర్ హుస్సేన్ చెప్పారు. సమావేశంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్ ఖాదర్ బాషా, నాయకులు కొమెరబత్తిన విజయ్‌కుమార్, వేముల శ్రీహరి, గరిణే పుల్లారావు, మందపాటి వీరారెడ్డి, జక్కా అశోక్, పల్లపు హనుమంతరావు, డాడీ, కొమెరబత్తిన ఆనంద్, కొలా జంపాలరెడ్డి, నట్టు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

‘పీఎం సూర్య ఘర్ యోజన’తో పర్యావరణ పరిరక్షణ

రెంటచింతల: సౌర విద్యుత్‌ను అందరికీ చేరువ చేసి సుస్థిర ప్రగతి సాధించాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పీఎం సూర్యఘర్ యోజన పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఏపీ ట్రాన్స్‌కో ఏఈ షేక్ మస్తాన్‌వలి కోరారు. బుధవారం మండల కేంద్రమైన రెంటచింతలలోని పలు కాలనీలలో ఆయన పర్యటించి, పీఎం సూర్య ఘర్ యోజన పథకంపై అవగాహన కల్పించి మాట్లాడారు. సోలార్ ప్యానెల్ ఏర్పాటు చేసుకుని కార్బన్ ఉద్గారాలను తగ్గించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని తెలిపారు. 200 యూనిట్లు లోపు విద్యుత్‌ను వినియోగించుకుంటున్న ఎస్సీ, ఎస్టీలు ఈ పథకం కింద ఉచితంగా కేంద్ర ప్రభుత్వం సోలార్ ప్యానెల్‌ను ఏర్పాటు చేస్తుందని చెప్పారు. ఒక కిలోవాట్ సోలార్ ప్యానెల్ ఏర్పాటు చేసుకున్న ఇతరులకు రూ. 18 వేలు సబ్సిడీ, రెండు కిలోవాట్లు ఏర్పాటు చేసుకున్న వారికి రూ. 30 వేలు, మూడు కిలోవాట్లు ఏర్పాటు చేసుకుంటే రూ. 78 వేలు రాయితీ ఇస్తుందని వివరించారు. సొంత ఇల్లున్న ప్రతి ఒక్కరూ ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. స్థానిక విద్యుత్ శాఖ సిబ్బందిని కలిసి సోలార్ ప్యానెల్ ఏర్పాటుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఓసీ, బీసీ వర్గాలకు చెందిన 20 మందితో పాటు ఎస్సీ, ఎస్టీలు రెండు వేల మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఏఈ తెలిపారు.

నీటి తొట్ల నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న చిన వెంకటేశ్వర్లు

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద మంజూరైన నీటి తొట్ల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని ఏపీఓ జి. చిన వెంకటేశ్వర్లు ఆదేశించారు. మండల ప్రజా పరిషత్ కార్యాయలంలో బుధవారం ఫీల్డ్ అసిస్టెంట్లకు నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవిలో మేత కోసం పొలాలకు వెళ్లే పశువులకు మంచినీటి వసతిలో భాగంగా ప్రభుత్వం మండలానికి 22 నీటి తొట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. ఒక్కో దాని నిర్మాణానికి రూ.33,220 కేటాయించినట్లు తెలిపారు. పశువులు మేతకు వెళ్లే ప్రాంతంలో నీటి వసతి ఉన్న ప్రదేశంలో తొట్టిని 10 అడుగుల విస్తీర్ణంలో నిర్మించాలని తెలిపారు. పంట పొలాలలో నీటి కుంటల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. మండలంలో ఇప్పటి వరకు 10,850 మందికి జాబ్ కార్డులు అందించామని, ఒక్కొక్క గ్రామంలో 30 నుంచి 80 మంది ఉపాధి పనులకు వస్తున్నారని తెలిపారు. కూలీలకు రోజుకు వేతనం రూ.307 ఇస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో అవసరమైతే మరికొన్ని పనులను చేపట్టేందుకు ఎఫ్ఏలు సిద్ధంగా ఉండాలని ఆయన ఆదేశించారు.ఎండల తీవ్రతకు పనులు జరుగుతున్న ప్రాంతాల్లో టెంట్లు, మెడికల్ కిట్లు, మంచినీటి సదుపాయం కల్పించాలని తెలిపారు. సమావేశంలో ఎఫ్ఏలు, టీఏలు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి భూములకు కౌలు వేలం వాయిదా

6.90 ఎకరాలకు గానూ రూ.70 వేల ఆదాయం

రెంటచింతల: స్థానిక శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానం భూములకు స్థానిక శివాలయ ఆవరణలో బుధవారం బహిరంగ వేలం పాటలను నిర్వహించినట్లు ఈఓ గాదె రామిరెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించిన ఈ వేలంలో దుర్గి మండలం ఓబులేసుపల్లె గ్రామానికి చెందిన దొడ్డా శివగోపి అనే రైతు 6.90 ఎకరాలను 2025–2026 నుంచి 2027–2028 వరకు ఏడాదికి రూ. 70 వేలకు కౌలు హక్కును పొందినట్లు చెప్పారు. గతంలో ఈ పంట భూమికి ఏడాదికి రూ. 36 వేలు కౌలు చెల్లించినట్లు తెలిపారు. దేవస్థానానికి ఉన్న మొత్తం 15.30 ఎకరాల మెట్ట భూమికి గాను మిగిలిన 8.40 ఎకరాలకు వేలం పాట ఈ నెల 11వ తేదీకి వాయిదా పడినట్లు వెల్లడించారు. కౌలు హక్కు పొందిన వారు ముందుగానే ప్రతి సంవత్సరం ఏప్రిల్ 30 తేదీలోపు చెల్లించి భూమిలో ప్రవేశించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పూర్ణచంద్రరావు, లక్ష్మారెడ్డి, సీపీఐ నాయకులు పాశం గోపయ్య, రైతులు పాల్గొన్నారు.

గీతాంజలిలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న యాజమాన్యం

వినుకొండ: స్థానిక గీతాంజలి స్కూల్స్‌లో గ్రాడ్యుయేషన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రిన్సిపాల్ టి. కృష్ణవేణి చిన్నారులకు కోర్స్ కంప్లీట్ చేసిన సందర్భంగా శుభాకాంక్షలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులు ఎంతో ఇష్టంతో పూర్తి చేసిన కోర్సునకు సంబంధించి వారికి ఇస్తున్న ఈ చిరు సత్కారం స్ఫూర్తిని నింపి మరెన్నో ఉన్నత శిఖరాలను చేరుకునేలా ఒక ప్రోత్సాహంగా, ఒక అపురూప జ్ఞాపకంగా ఉంటుంది అనే సదుద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం గాడ్యుయేషన్ సంప్రదాయ దుస్తులు ధరించిన చిన్నారులకు కోర్స్ కంప్లీటెడ్ సర్టిఫికెట్స్ ప్రతిభా పురస్కారాలు అందించారు. కార్యక్రమంలో గీతాంజలి విద్యాసంస్థల డైరెక్టర్ వై.శేషగిరి, కరస్పాండెంట్ వై. లక్ష్మణ కిశోర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రాణం నిలిపిన ఇంజక్షన్



వైద్యసేవలు అందిస్తున్న ఏఎన్ఎం చందోలు నాగవాణి

వినుకొండ: మండలం పెదకంచర్ల గ్రామ రైస్ మిల్లుకు వడ్లతో విజయవాడ నుంచి ఒక లారీ బుధవారం వచ్చింది. లారీ క్లీనర్ శివయ్య ఉదయం 8 గంటల సమయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి గుండెనొప్పితో వచ్చాడు. చెమటలతో తడిచి, పడిపోయే పరిస్థితిలో ఉన్నాడు. ఆరోగ్య కేంద్రం ఏఎన్ఎం చందోలు నాగవాణి, సీహెచ్‌వో ప్రమీల ప్రాథమిక చికిత్స అందించారు. హుటాహుటిన నాగమణి తన సొంత కారులోనే వినుకొండ ఏరియా ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రజాక్, సిబ్బంది వెంటనే ఈసీజీ తీసీ రక్తపరీక్షలు బీసీ చెక్ చేసి ప్రభుత్వం అందుబాటులో ఉంచిన రూ.40 వేలు గుండె నొప్పి ఇంజక్షన్ ఇచ్చి ప్రాణాలను కాపాడారు. అనంతరం ఏఎన్ఎం నాగవాణి విషయాన్ని విజయవాడలోని బంధువులకు సమాచారం అందించి, మెరుగైన వైద్యచికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో గుంటూరుకు తరలించారు. ఇటీవల గుండె నొప్పి ఇంజక్షన్ అందుబాటులో ఉంచడం, తక్షణమే సిబ్బంది వైద్యం అందించడంతో రోగి తరపు బంధువులు, పెంచర్ల గ్రామస్తులు, రైస్ మిల్లు ఓనర్ శ్రీనివాసరావు ధన్యవాదాలు తెలిపారు.

మైనర్లకు వాహనాలివ్వొద్దు

నరసరావుపేట టౌన్: మైనర్లకు నడపటానికి వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని టూటౌన్ సీఐ హైమారావు హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మైనర్ యువకులు వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. దీంతో వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే ఆటోలను సీజ్ చేస్తామని డ్రైవర్లను హెచ్చరించారు. వాహన చోదకులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించి, ప్రమాదాల నియంత్రణకు సహకరించాలని ఆయన కోరారు. సరైన పత్రాలు లేని 11 వాహనాలపై కేసు నమోదు చేసి యజమానుల వద్ద నుంచి అపరాధ రుసుం వసూలు చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్ట్ అండ్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలిగా రమాదేవి



పిడుగురాళ్ల: ఏంజెల్ ఫ్రెడ్ కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్ట్ అండ్ ఆర్గనైజేషన్ పల్నాడు జిల్లా ప్రెసిడెంట్‌గా ఓబులాపురం రమాదేవి ఎన్నికయ్యారు. ఏపీ వినియోగదారుల హక్కుల పరిరక్షణ సంస్థ ఏంజెల్ ఫ్రెడ్ కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్ట్ ఆర్గనైజేషన్ కార్యవర్గ సమావేశం బుధవారం నర్సరావుపేట పట్టణంలోని ఎల్‌బీ కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న శ్రీ రాజన్న సత్రం ఫంక్షన్ హాలులో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు పిల్లి జ్ఞానారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల పరిధిలో నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఇందులో భాగంగా పల్నాడు జిల్లా సంస్థ జిల్లా ప్రెసిడెంట్‌గా ఓబులాపురం రమాదేవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఎస్సీల సమస్యలు పరిష్కరించండి



మాచర్ల: పల్నాడు జిల్లా డీఆర్‌ఓగా బాధ్యతలు చేపట్టిన ఏకా మురళీని దళిత బహుజన ఫ్రంట్ సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు కుక్కమూడి ప్రసాద్ ఆధ్వర్యంలో సభ్యులు కలిసి ఎస్సీల సమస్యలపై వినతి పత్రం ఇచ్చారు. అనంతరం శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఎస్సీల సమస్యలను పరిష్కరిస్తానని డీఆర్‌ఓ హామీ ఇచ్చినట్లు చెప్పారు. ఆయన వెంట మామిడి రవి, పరిమళ రాజారావు ఉన్నారు.

22న పోలేరమ్మ తిరునాళ్లు

యడ్లపాడు: మండలంలోని మైదవోలులో గ్రామ దేవత పోలేరమ్మ అమ్మవారి వార్షిక తిరుణాల మహోత్సవం ఈనెల 22వ తేదీ అంగరంగ వైభవంగా జరగనుంది. మంగళవారం తెల్లవారుజాము నుంచే అమ్మవారికి విశేష అలంకారాలతో ప్రత్యేక పూజలు ప్రారంభం కానున్నాయని గ్రామస్తులు తెలిపారు. ఆలయం వద్ద పొంగళ్లు, నైవేద్యాల సమర్పణతో పాటు పలు రకాల ప్రసాదాల పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. తిరునాల సందర్భంగా పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చెత్త సంపద కేంద్రాలతో అదనపు ఆదాయం

శావల్యాపురం: చెత్త సంపద కేంద్రాల నుంచి పంచాయతీలకు అదనపు ఆదాయం వచ్చేలా క్షేత్రస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు బాధ్యత వహించాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. బుధవారం స్థానిక చెత్త సంపద కేంద్రంలో నూజెండ్ల మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్రలు, షెడ్యూ మిత్రలకు ఒక రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. చెత్త సంపద కేంద్రాల ద్వారా వానపాముల వర్మీకంపోస్టు ఎరువు తయారు చేయు విధానం, తడి, పొడి చెత్తను వేరు చేసి పంచాయతీలకు అదనపు ఆదాయం వచ్చేలా చేయాల్సిన విధివిధానాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ యాగసిరి చెన్నమ్మ, ఈవోపీఆర్‌డీలు పి.సుగుణ, రబ్బాని పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న దాతలు

రొంపిచర్ల : మండలంలో మాచవరం గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఒకటో తరగతి చదువుతూ అనారోగ్యంతో బాధ పడుతున్న విద్యార్థికి బుధవారం ఆర్థిక సహాయం అందించారు. పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న పేద విద్యార్థి గర్నెపూడి ప్రేమకుమార్ లివర్, కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న నాజ్ ఫౌండేషన్ ఫర్ ఎడ్యుకేషన్, గుంటూరు వారి తరపున బి.లాల్ అహమ్మద్ రు. 5వేలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.నాగరాజు వెయ్యి రూపాయలు, మదన్ మోహన్ వెయ్యి రూపాయలు అందజేశారు. అనారోగ్యంతో బాధ పడుతున్న పేద విద్యార్థికి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం చేసిన వారిని గ్రామ పెద్దలు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ పి.అబ్రహం, ఉపాధ్యాయులు ఎం.వి.నాగయ్య, రామాంజనేయులు, అంతయ్య, అచ్చయ్య, శారద తదితరులు అభినందించారు.

అధికారులు స్పందించకపోతే చర్యలు

ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



ప్రజా దర్బార్‌లో వినతి పత్రాన్ని స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

వెల్దుర్తి: నియోజకవర్గంలో ప్రజా సమస్యలపై స్థానిక అధికారులు స్పందించకపోతే చర్యలు తీసుకుంటానని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తెలిపారు. బుధవారం వెల్దుర్తి కార్యాలయంలో జరిగిన ప్రజా దర్బార్‌లో ఆయన మాట్లాడారు. ప్రజల నుంచి సమస్యలపై వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయపరమైన ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు స్పందించి, సత్వరమే పరిష్కరించాలని సూచించారు. అధికారులు స్పందించకపోతే ప్రజలు నేరుగా తనను కలుస్తారని, ఆ తరువాత సీరియస్ యాక్షన్ ఉంటుందని పేర్కొన్నారు. ప్రజా దర్బార్‌లో 80 అర్జీలు అందాయని తెలిపారు. ఇందులో గత ఐదేళ్లలో జరిగిన భూ కబ్జాలు, దందాలు, దోపిడీలు అవినీతికి సంబంధించి ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. వీటిని నిర్ణీత సమయంలో విచారించి పరిష్కరిస్తామని ఎమ్మెల్యే భరోసా యిచ్చారు. కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు.

12న సినిమా పాటల పోటీలు

మాచర్ల: శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి కల్యాణం సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ మాచర్ల, పల్నాడు వారి ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి సినిమా పోటీలను 12న మానుకొండ కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు లయన్స్ క్యాబినెట్ గెస్ట్ కార్యక్రమ నిర్వాహకులు చుండూరు వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం ఆయనతో పాటు నిర్వాహకుడు అల్లం కోటిరెడ్డి, చెన్నకేశవరావు, కుర్రి సాయి మార్కొండారెడ్డి, పి.వి. నర్సరాజులు మాట్లాడారు. పాటల పోటీల వివరాలు, బహుమతులు సమాచారం వెల్లడించారు. మొదటి బహుమతి కింద డాక్టర్ ఎం. మురళీకృష్ణ (రూ. 5వేలు), ద్వితీయ బహుమతి కింద కమలాసనరావు (రూ. 4వేలు) మూడవ బహుమతి అల్లం వెంకటేశ్వరరెడ్డి (రూ. 3వేలు), కన్సలేషన్ బహుమతి (రూ. 1000) చొప్పున అల్లం కోటిరెడ్డి అందజేస్తారని తెలిపారు. ఆ రోజు రాత్రి జరగనున్న కార్యక్రమానికి ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు హాజరవుతారని పేర్కొన్నారు. ఎంట్రీ ఫీజులేదని, అందరూ పాల్గొనవచ్చని తెలిపారు. ముందుగా ఆ రోజు ఉదయం 10గంటలకు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

విద్యార్థులకు పరీక్షల కిట్స్ పంపిణీ



పరీక్షల కిట్స్ అందజేస్తున్న సభ్యులు

రొంపిచర్ల : మండలంలో నల్లగార్లపాడు, మాచవరం గ్రామాలలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు బుధవారం పరీక్షల కిట్స్ అందజేశారు. గుంటూరు నాజ్ ఫౌండేషన్, గణిత శాస్త్ర ఉపాధ్యాయులు మదన్ మోహన్ సహకారంతో నల్లగార్లపాడు గ్రామంలో గల ఆర్‌సీయం ప్రైమరీ స్కూల్, అంబేడ్కర్ నగర్‌లో గల ఎంపీపీ స్కూల్, మాచవరం గ్రామంలో గల ఎంపీపీ(ఎస్టీ) స్కూల్‌లలో 5వ తరగతి పూర్తి చేసుకుని 6వ తరగతిలో చేరబోతూ పరీక్షలు వ్రాస్తున్న విద్యార్థులకు కిట్స్ పంపిణీ చేశారు. మండలంలోని మాచవరం గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా మారుతున్న సందర్భంగా తల్లిదండ్రులు తమ పిల్లలను 6వ నుంచి 9వ తరగతి వరకు చదువుకునేందుకు చేర్పించాలని ప్రధానోపాధ్యాయులు నాగరాజు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ పి.అబ్రహం కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుల విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వ్యవసాయంలో యువతను ప్రోత్సహించాలి

ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ శివనారాయణ



మాట్లాడుతున్న డాక్టర్ శివనారాయణ

నరసరావుపేట రూరల్: వ్యవసాయ రంగంలో యువతను ప్రోత్సహించి నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునే విధంగా అవగాహన కల్పించాలని ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ శివనారాయణ తెలిపారు. రావిపాడు ఏరువాక కేంద్రంలో జిల్లాస్థాయి సమన్వయ సంఘం సమావేశం బుధవారం నిర్వహించారు. లాం పరిశోధన కేంద్రం అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్‌వీఎస్‌డీ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో డాక్టర్ శివనారాయణ మాట్లాడుతూ వ్యవసాయ పరిస్థితులకు అనుగుణంగా అధిక ఆదాయాన్నిచ్చే పంటల గురించి రైతులకు తెలియజేయాలన్నారు. రైతులు కూడా విలువ ఆధారిత ఉత్పత్తులను సాగుచేసి అధిక ఆదాయాన్ని పొందాలని తెలిపారు. డాట్ సెంటర్ కో–ఆర్డినేటర్ డీఎం నగేష్ మాట్లాడుతూ 2024–25 సంవత్సరంలో ఏరువాక కేంద్రంలో జరిగిన ప్రదర్శన క్షేత్రాల ఫలితాలు, వరి, శగన, కంది పంటలలోని చిరుసంచుల ఫలితాలను వివరించారు. కంది పంట సాగులో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను పలువురు శాస్త్రవేత్తలు తెలియజేశారు. కంది పైరును ఆగస్టు, సెప్టెంబర్‌లో 72 అంగుళాలు, అక్టోబర్‌లో 42 అంగుళాలు సాలుకు సాలుకు మధ్య దూరం పాటించాలని తెలిపారు. మిరపలో బొబ్బరను తట్టుకునే విధంగా నాటు రకాలు, ప్లాస్టిక్ మల్చింగ్ విధానాలు పాటించాలని సూచించారు. దీని వల్ల నల్లతామర ఉధృతి తగ్గించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి, జిల్లా ఉద్యాన అధికారి సీహెచ్.వి. రమణారెడ్డి, జిల్లా సూక్ష్మ,నీటి పారుదల అధికారి సీహెచ్.ఆంజనేయులు, నాబార్డ్ జిల్లా అధికారి శరత్, జిల్లా పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్. కోటిరత్నం, డీఆర్‌సీ డీడీఏ శివకుమారి, జిల్లా మత్స్య శాఖ అధికారి డాక్టర్ సంజీవరావు, వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ కె.వి.శివారెడ్డి, డాక్టర్ మనోజ్‌కుమార్, డాక్టర్ సైదానాయక్ పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపులో వివాదం

- బొందిలిపాలెంలో అధికారుల తీరుపై స్థానికుల ఆగ్రహం
- కక్ష సాధింపు చర్యలేనంటూ పలువురు ఆవేదన



ఆక్రమణలో తొలగింపుపై మాట్లాడుతున్న బాధితులు

శావల్యాపురం: మండలంలోని బొందిలిపాలెంలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా బీసీ కాలనీలో నూతన సీసీ డ్రెయిన్స్ నిర్మాణ పనులకు రూ.8 లక్షల నిధులు మంజూరయ్యాయి. అందులో భాగంగా కాలనీలో ఆక్రమణలు తొలగింపునకు పంచాయతీ అధికారులు బుధవారం శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో నివాస గృహాల వారికి పంచాయతీ అధికారులకు మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడింది. నివాస గృహాల హక్కుదారులకు పంచాయతీ అధికారులు ముందుస్తుగా నోటీసులు ఇవ్వకుండానే పొక్లయినర్ ద్వారా తొలగింపు పనులు చేపట్టడం ద్వారా పంచాయతీ అధికారులకు నివాస గృహాలకు చెందిన కుటుంబ సభ్యులకు మధ్య తీవ్రస్థాయిలో వాగ్వివాదం చోటు చేసుకుంది. పంచాయతీ కార్యదర్శి తీరును ప్రశ్నించటంతో పాటు రాజకీయ కారణాల కక్ష సాధింపు చర్యలకు నేపథ్యంలో ఇలాంటి పనులకు అధికారులు పాల్పడటం హేయమైన చర్య అని మాజీ సర్పంచ్ బోడాల వీరాంజినేయులు మండిపడ్డారు. గ్రామానికి చెందిన బోడాల వెంకటేశ్వర్లు, ఇర్ల నాగమణిలు మాట్లాడుతూ నోటీసులు ఇవ్వకుండా తొలగించడం అన్యామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి బాలపరమేశ్వరరావు మాట్లాడుతూ సీసీ డ్రెయిన్స్ నిర్మాణ పనులకు సంబంధించి మూడు నెలల నుంచి నివాస గృహాల వారందరికీ ఆక్రమణలు తొలగించాలని నోటీసులు అందజేశామన్నారు. వినుకొండ రూరల్ సీఐ బి.ప్రభాకర్ రావు, ఎస్సైలు లేళ్ల లోకేశ్వరరావు, కత్తి స్వర్ణలత మహిళా పోలీసులు పటిష్టమైన బందోబస్తు నడుమ పంచాయతీ అధికారుల సమక్షంలో ఆక్రమణలు తొలగించారు.